# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

**1.** **ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన జల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ చర్యలపై గోదావరి రివర్ బోర్డు ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చించారు.**

**2.** **మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

**3.** **సంప్రదాయ పంటల నుంచి పామాయిల్ సాగు వైపు దృష్టి సారించాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు.**

**4.** **సూర్య ఘర్ పథకం ద్వారా  షెడ్యూల్ కులాలు, తెగల వారికి ఉచితంగా సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.**

**4.** **దేశ స్వాతంత్ర్య చరిత్రలో అత్యంత బాధాకర ఘటన అయిన ‘జలియన్ వాలాబాగ్’ మారణకాండకు నేటితో 107 సంవత్సరాలు పూర్తయ్యాయి.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ చైర్మన్ పి. దోర్జే గ్యాంబా అమరావతిలో నిన్న మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ చర్యలపై ముఖ్యమంత్రి వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో  జల వనరుల వివరాలను రియల్ టైమ్ గవెర్నెన్స్ లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అలాగే వరద జలాల వినియోగం, నదుల అనుసంధాన ప్రణాళికలపై కూడా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ సరిహద్దులో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు సమస్యను దోర్జే గ్యాంబా సమావేశంలో ప్రస్తావించారు. గత వరదల్లో కట్ట దెబ్బతినడంతో రెండు రాష్ట్రాల్లో వరదలు సంభవించాయని గుర్తు చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు కట్టను బలోపేతం చేయడానికి తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు.  ఇందులో భాగంగా ఈరోజు ఎన్డీఏ కూటమి పార్లమెంట్ సభ్యులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఈ సందర్భంగా అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ పార్లమెంట్ సభ్యులు కృతజ్ఞతలు తెలపనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. చట్టసభలలో మహిళలకు ప్రాధాన్యత కల్పించడానికి ఈ పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ....

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాజకీయాలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీలు మద్దతివ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ లో మంత్రి నిన్న మాట్లాడుతూ, మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు దశాబ్దాల నాటి కల అని, ఈ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమని చెప్పారు. పునర్విభజనతో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయన్నారు. అలాగే తెలంగాణ శాసన సభ స్థానాలు పెరుగుతాయని దీని ద్వారా మహిళలకు మరింత అవకాశాలు లభిస్తాయని బండి సంజయ్ తెలిపారు.

---------------------------

మెరుగైన రాబడి కోసం రైతులు సంప్రదాయ పంటల నుంచి పామాయిల్ సాగు వైపు దృష్టి సారించాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన రైతు వేదిక వద్ద రైతులకు వ్యవసాయ పరికరాలను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తోందన్నారు. చిన్న గ్రామాల్లో 50 ఎకరాలు, పెద్ద గ్రామాల్లో 100 ఎకరాల వరకు పామాయిల్ పంట సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

దేశ చరిత్రలో అత్యంత బాధాకర ఘటన అయిన 'జలియన్ వాలాబాగ్' మారణకాండ జరిగి నేటికి 107 సంవత్సరాలు పూర్తయ్యాయి. బ్రిటీష్ వారి దాష్టికానికి అనేక మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్ సర్ పట్టణంలో జలియన్ వాలా బాగ్ అనే తోటలో వైశాఖి పండుగ జరుపుకోవడానికి వేలాది మంది సిక్కులు సమావేశమయ్యారు. వారిపై... ఆంగ్లేయులు ఒక్క సారిగా కాల్పులు జరిపారు. ఈ అనూహ్య ఘటనతో జలియన్ వాలాబాగ్లో సమావేశమైన ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఏకధాటిగా పది నిమిషాలపాటు విచక్షణారహితంగా బ్రిటిష్ సైన్యం కాల్పులు కొనసాగించింది. బయటకు వెళ్లేందుకు దారి లేకుండా అన్ని ద్వారాలు మూసిఉండటంతో సుమారు వెయ్యి మందికి పైగా మరణించారు. ఈ దురాగాతాన్ని భారత స్వాతంత్ర్య చరిత్రలో అతి పెద్ద దుర్ఘటనగా ప్రస్తావిస్తారు.

---------------------------

షెడ్యూల్ కులాలు, తెగలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం పాత బగ్గాం గ్రామంలో "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన"లో భాగంగా నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ

సోలరైజేషన్ ఉత్సవ్ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గజపతినగరం నియోజకవర్గంలో 2 వేల 170 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను ఈ పథకం ద్వారా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి నిన్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 5.08 కోట్ల రూపాయలతో పనులను ప్రారంభించామని చెప్పారు. అలాగే 1.25 కోట్ల రూపాయలతో నిత్యాన్నదాన సత్రం, 29 లక్షలతో లడ్డూ పోటు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వివరించారు.

---------------------------

క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ముందస్తు ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ విద్యతో పాటు సంపూర్ణ అభివృద్ధికి క్రీడలు అత్యవసరం అని అన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రాజమహేంద్రవరం నగరంలో క్రీడా వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నామని పురందేశ్వరి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

ఇక తెలంగాణ వ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర ఫలకాలను ఏర్పాటు చేసే కార్యక్రమంలోగృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా సూర్యాంధ్ర ప్రగతి రథాన్ని జెండా ఊపి ప్రారంభించి, ప్రచార పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సౌర శక్తి వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

====================